ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

యాదాద్రి భువనగిరి

3

గురువారం 7 మార్చి 2024



హెల్ప్‌లైన్ నంబర్లు	
దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్	18005728980
నల్లగొండ	18004251442
యాదాద్రి	1800 425 7106
సూర్యాపేట	1800 425 1972

చికెన్ ధరలు — గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.138	200	228
సూర్యాపేట	రూ.135	200	230
నల్లగొండ	రూ.140	200	260

ఉష్ణోగ్రత గరిష్ఠం 36.5 । కనిష్ఠం 23.8



పోటాపోటీ

- ఎంపీ టికెట్ కోసం అన్ని పార్టీల్లో ఆశావహుల యత్నాలు
- ఏ క్షణమైనా కాంగ్రెస్ జాబితా
- బీఆర్ఎస్‌లో అభ్యర్థిత్వాలపై మల్లగుల్లాలు
- బలమైన పోటీకి సిద్ధంగా ఉండాలంటున్న బీజేపీ

లోక్‌సభ సీట్లకు అభ్యర్థుల ఎంపిక కొలిక్కివస్తుండడంతో ఆశావహుల ప్రయత్నాలు ముమ్మరమయ్యాయి. ఉమ్మడి జిల్లాలోని రెండు సీట్లకూ మూడు ప్రధాన పార్టీల నుంచి బలమైన నేతలు టికెట్ ఆశిస్తుండడం, గెలుపే లక్ష్యంగా పార్టీల అధిష్ఠానాలు అభ్యర్థుల ఎంపికకు కసరత్తు చేస్తుండడంతో టికెట్ ఎవరికి దక్కుతుందనే అంశంపై రోజుకో సమీకరణం తెరమీదకు వస్తోంది. బీజేపీ తొలిజాబితాలో భువనగిరి లోక్‌సభ స్థానం నుంచి బీసీ వర్గానికి చెందిన మాజీ ఎంపీ డాక్టర్ బూరనర్సయ్యగౌడ్‌కు టికెట్ కేటాయించడం, మరోవైపు బీఆర్ఎస్ నుంచి సైతం రెండింటిలో ఒక స్థానంలో బీసీ లేక ఎస్టీ వర్గానికి చెందిన నేతలకు టికెట్ ఇవ్వాలనే ప్రతిపాదనలు అధిష్ఠానం ముందుకు చేరగా, అధికార కాంగ్రెస్‌లోనూ సామాజిక స్వరం వినిపిస్తోంది. రేపోమాపో టికెట్ ఖరారవనుండడంతో ఆశావహులు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు.

- (ఆంధ్రజ్యోతి ప్రతినిధి,నల్లగొండ)

బీఆర్ఎస్‌లో మల్లగుల్లాలు



బీఆర్ఎస్ నుంచి ఎవరిని బరిలో దింపాలనే అంశంపై ఆ పార్టీ అగ్రనేతలు మల్లగుల్లాలు పడుతున్నారు. శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి తనయుడు అమిత్‌రెడ్డి రెండు సీట్లలో ఏదో ఒక చోట తనకు పోటీచేసే అవకాశం దక్కుతుందనే ధీమాతో ఉన్నారు. నల్లగొండ నుంచి మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి సోదరుడు కంచర్ల కృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ తేరా చిన్నపరెడ్డి సైతం టికెట్ కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ స్థానంలో గిరిజన, బీసీ ఓటర్లు అధికంగా ఉన్నందున ఆ వర్గాలకు చెందిన నేతలను బరిలో దింపడం ద్వారా కాంగ్రెస్‌ను గట్టిగా ఢీకొట్టవచ్చనే అభిప్రాయాన్ని కీలకనేతలు అధిష్ఠానం ముందుంచడంతో ఆ దిశగా పరిశీలన చేస్తున్నారు. ప్రధానంగా బీసీవర్గాల నుంచి సీనియర్‌నేత సుంకరి మల్లేశ్‌గౌడ్ ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఆయన ఇప్పటికే బీసీ నినాదంతో అసెంబ్లీ నియోజకవర్గాల్లో సమావేశాలు నిర్వహిస్తూ టికెట్ కోసం ఒత్తిడి తెస్తున్నారు. గతంలోనూ డీసీసీబీ ఛైర్మన్ పదవి ఇస్తామని ఇచ్చిన హామీ నెరవేర్చలేకపోయారని, ఈ సారైనా ఎంపీ టికెట్ ఇవ్వాలని కోరుతున్నారు. మరో కీలక నేత చాడ కిషన్‌రెడ్డి సైతం అధిష్ఠానం ఈసారి అవకాశమివ్వాలని, 2001 నుంచి పార్టీలో విధేయతతో ఉన్నానని, ప్రతీ కార్యక్రమాన్ని విజయవంతం చేశానని, పదేళ్ల అధికారంలో ఉన్న సమయంలోనూ అవకాశాలు ఇవ్వలేకపోయారని, ఈ దఫా తప్పకుండా పోటీకీ ఛాన్స్ ఇవ్వాలని కోరుతున్నారు. గిరిజనవర్గాలకు టికెట్ ఇస్తే మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్, ప్రముఖ వైద్యు డు డాక్టర్ మాతృనాయక్, ట్రైకార్ మాజీ ఛైర్మన్ రాంచందర్‌నాయ క్ పేర్లను పరిశీలిస్తున్నట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. భువనగిరి స్థానంనుంచి అమిత్‌రెడ్డితోపాటు ఉద్యమనేత జిట్టా బాలకృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్‌రెడ్డి టికెట్ కోసం ప్రయత్నిస్తున్నారు. బీసీ కోటాలో ఛాన్స్ ఇవ్వాలని శాసనమండలి మాజీ ఛైర్మన్ నేతి విద్యాసాగర్, మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్ టికెట్ కోసం ప్రయత్నిస్తున్నారు.

కాంగ్రెస్‌లో పోటాపోటీ



ఉమ్మడి నల్లగొండ జిల్లాలో రెండు ఎంపీ సీట్లను భారీ మెజార్టీతో గెలిపించాలనే లక్ష్యంతో మంత్రులు ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అభ్యర్థుల ఎంపికలో వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారని, ఎవరికి టికెట్ ఇవ్వాలనే అంశంలో నేతలిద్దరూ ఇప్పటికే అధిష్ఠానానికి స్పష్టమైన ప్రతిపాదనలు చేశారనే చర్చ పార్టీలో సాగుతోంది. రేపోమాపో అభ్యర్థుల ప్రకటన ఉంటుందనే చర్చ నేపథ్యంలో ఆశావహులు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. నల్లగొండ లోక్‌సభ స్థానం నుంచి పీసీసీ ప్రధాన కార్యదర్శి కుందూరు రఘువీర్‌రెడ్డికి లైన్‌క్లియర్ అయినట్లేనని చర్చసాగుతోంది. మరో వైపు పీసీసీ ప్రధాన కార్యదర్శి పటేల్ రమేష్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ముఖ్యఅనుచరుడు గుమ్ముల మోహన్‌రెడ్డి సైతం టికెట్‌పై ధీమాగా ఉన్నారు. భువనగిరి స్థానం నుంచి పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీని పోటీకి ఆహ్వానించామని మంత్రి కోమటిరెడ్డి ప్రకటించినా, రాహుల్‌గాంధీ పోటీ చేయకపోతే మంత్రి కుటుంబానికి చెందిన ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి సతీమణి కోమటిరెడ్డి లక్ష్మి, లేదా మంత్రి సోదరుడి కుమారుడు డాక్టర్ సూర్యపవన్‌రెడ్డిలో ఒకరికి టికెట్ దక్కుతుందనే చర్చసాగుతోంది. ఇదే స్థానం కోసం పీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, బీసీ నినాదంతో చెనగాని దయాకర్‌గౌడ్ ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

బలమైన అభ్యర్థిని దింపాలని బీజేపీ పావులు

నల్లగొండ లోక్‌సభ స్థానంలో బీజేపీ నుంచి బలమైన అభ్యర్థిని బరిలో దింపాలని ఆ పార్టీ భావిస్తోంది. సీనియర్‌నేతలు గొంగిడి మనోహర్‌రెడ్డి, గత ఎన్నికల్లో పోటీచేసిన గార్లపాటి జితేంద్రకుమార్, గోలి మధుసూదన్‌రెడ్డి, నూకల నరసింహారెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి టికెట్ కోసం ప్రయత్నిస్తున్నారు. అయితే ఇక్కడ పోటీకి బీఆర్ఎస్ నుంచి ఒక మాజీ ఎమ్మెల్యేను బీజేపీ నేతలు సంప్రదించినప్పటికీ అటువైపు నుంచి ఎలాంటి స్పందన రాలేదు. దీంతో బీసీవర్గ నేత రామరాజు యాదవ్ అభ్యర్థిత్వంపైనా బీజేపీ కసరత్తు చేస్తోంది. కాంగ్రెస్, బీఆర్ఎస్ అనుసరించే వ్యూహానికి దీటుగా తాము అభ్యర్థిని తెరమీదకు తెస్తామని, బలమైన పోటీ ఇస్తామనే వాదన బీజేపీ నేతల నుంచి వస్తోంది.

పద్ధతి ప్రకారం అభివృద్ధి, సంక్షేమం అమలు

- మూడు నెలల్లోనే 30వేల ఉద్యోగాలు భర్తీ
- ప్రతీ నియోజకవర్గానికి రూ.20కోట్లతో రోడ్లు అభివృద్ధి
- రాష్ట్రంలో రూ.1150కోట్లతో నూతనంగా రోడ్లు
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి, చిత్రంలో విప్ బీర్ల అయిలయ్య, ఎమ్మెల్యే మందుల సామేలు

యాదాద్రి, మార్చి6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఒక పద్ధతి ప్రకారం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. బుధవారం భువనగిరిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరుగ్యారంటీల్లో ఐదు అమలు చేస్తున్నామని, దీంతో ప్రజల కళ్లల్లో ఆనందం కనబడుతుందన్నారు. జిల్లాకు సంబంధించిన అన్ని అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తామని, జిల్లాకు చెందిన సాగునీటి ప్రాజెక్టులపై సంబంధిత మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో చర్చించామన్నారు. బస్వాపూర్, గంధమల్ల ప్రాజెక్టులు, సాగునీటి కాల్వల అభివృద్ధికి రూ200కోట్లతో చర్యలు తీసుకుంటామన్నారు.ప్రతీ నియోజకవర్గానికి రూ20కోట్లతో రోడ్లు అభివృద్ధి చేయనున్నామని, అన్ని కూడా త్వరలోనే మంజూరు చేస్తామన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు ఒకటో తేదీన వేతనాలు అందించి, పాత రోజులు తీసుకొచ్చామన్నారు. గత ప్రభుత్వ హయాంలో 15వ తేదీ నుంచి 20 తేదీల్లో ఉద్యోగులకు వేతనాలు అందేవని, దీంతో ఉద్యోగులు తీవ్రంగా ఇబ్బందులుపడ్డారని తెలిపారు. రాష్ట్రంలో మూడు నెలల్లోనే 30 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని, ప్రభుత్వం ఆర్థిక క్రమశిక్షణతో ప్రత్యేక టీంగా ఏర్పడి పనిచేస్తున్నామన్నారు. ఈ నెల 11వ తేదీన భద్రాచలంలో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభిస్తామని, ప్రతీ నియోజకవర్గానికి 3,500 ఇళ్లను మంజూరు చేస్తామన్నారు. ప్రధాని నరేంద్రమోదీని కలిసి రీజినల్ రింగ్‌రోడ్డుకు నిధులు మంజూరు చేయాలని కోరామని, ఆర్ఆర్ఆర్‌తో ప్రజలకు ఎలాంటి ఇబ్బందికాకుండా.. ఎవరికి నష్టం కలుగకుండా మార్పులు, చేర్పులు చేసుకుంటామన్నారు. రాష్ట్రంలో రోడ్ల అభివృద్ధికి రూ.1,150 కోట్లతో పనులు చేపట్టనున్నామని, అర్హులైన వారికి ఇళ్లు, రేషన్‌కార్డులు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ విధానంతో సేద్యం చేపట్టాలి

రాజాపేట: రైతులు శాస్త్రీయ విధానంతో సేద్యం చేపట్టి అధిక లాభాలు సాధించాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కోరారు. రాజాపేటలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్‌ను ఆయన ప్రారంభించారు. వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపితో వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ వడగండ్లతో భువనగిరి, ఆలేరు నియోజకవర్గాల్లో పంట నష్టం అధికంగా జరిగిందని, పంట బీమా అమలు చేయాలన్నారు. రాజాపేట మండలంలో ప్రతీ ఏటా వడగండ్లతో రైతులు పంటలు నష్టపోతున్నారని, క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందాలని, రసాయన మందుల వినియోగాన్ని తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకంతో పండించాలని, శాస్త్రీయ విధానాలతో సాగు చేసి అధిక లాభాలను పొందాలన్నారు. కార్యక్రమంలో ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, వ్యవసాయ శాఖ ఏడీఏ పద్మావతి, మండల వ్యవసాయ అధికారి మాధవి, ఎంపీటీసీ రాజు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'రైతు నేస్తం' ద్వారా శాస్త్ర సంకేతిక పరిజ్ఞానం



వీడియో కాన్ఫరెన్స్‌ను వీక్షిస్తున్న కలెక్టర్ హనుమంతు కే.జెండగే

వలిగొండ, మార్చి 6: రైతునేస్తం ద్వారా రైతుల ముంగిటకు శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వస్తోందని కలెక్టర్ హనుమంతు కే. జెండగే తెలిపారు. రాష్ట్ర ప్రభు త్వం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'రైతునేస్తం' వీడియో కాన్ఫరెన్స్‌ను బుధవారం మండలకేంద్రంలో కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్కువ పెట్టుబడితో లాభదాయక పంటలను సాగు చేయడానికి రైతునేస్తం దోహదపడుతుందన్నారు. రైతునేస్తం రై తులకు ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. రైతులు పండించే పంటల వివరాలను తె లుసుకోవచ్చన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకొని రైతులు తమ వ్యవసాయ పంటలను సాగు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అనురాధ, ఎంపీపీ నూతి రమేష్‌రాజు, ఏడీఏ దేవ్‌సింగ్, తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీవో జితేందర్‌రెడ్డి, మండల ఇన్‌చార్జి వ్యవసాయ అధికారి అజాజ్ అలీఖాన్, వ్యవసాయ విస్తరణ అధికారి శృతి, ఏఈవో సాయి, సబిత, రైతులు పాల్గొన్నారు.

పోచంపల్లి ఇక్కత్ వస్త్రాలకు ఖండాంతర ఖ్యాతి

భూదాన్‌పోచంపల్లిని సందర్శించిన విదేశీ పర్యాటకుల కితాబు



చేనేత వస్త్రాల తయారీ ప్రక్రియలను పరిశీలిస్తున్న విదేశీ బృందం

భూదాన్‌పోచంపల్లి, మార్చి 6: పోచంపల్లి చేనేత టైఅండ్‌డై సిల్కు చీరలకు ఖండాంతర ఖ్యాతి ఉందని విదేశీ పర్యాటకులు కితాబిచ్చారు. కొలంబియా దేశానికి చెందిన తొమ్మిది మంది విదేశీ పర్యాటకుల బృందం బుధవారం భూదాన్‌పోచంపల్లిని సందర్శించింది. ఈ సందర్భంగా పట్టణంలోని చేనేత యూనిట్లను సందర్శించారు. అనంతరం రూరల్ టూరిజం సెంటర్‌లోని మ్యూజియం సందర్శించారు. మ్యూజియంలోని 'లీవ్‌టుక్లాత్' ప్రాసెసింగ్ యూనిట్ సందర్శించి చేనేత ఇక్కత్ వస్త్రాల తయారీ ప్రక్రియలను పరిశీలించారు. అనంతరం చేనేత కార్మికుల ఇళ్లను సందర్శించారు. వారి జీవన స్థితిగతులను, చేనేత పరిశ్రమ తీరుతెన్నులను అడిగి తెలుసుకున్నారు. చేనేత వస్త్ర త యారీ ప్రక్రియలను పరిశీలించారు. చేనేత టైఅండ్‌డై ఇక్కత్ పట్టుచీరల డిజైన్లను పరిశీలించి, చేనేత కళాకారుల కళాత్మక ప్రతిభను వారు ప్రశంసించారు. చేనేత సహకార సం ఘం విక్రయశాలలోని చేనేత వస్త్రాలను వారు పరిశీలించారు. చేనేత సహకార సంఘం పనితీరులను మేనేజర్ రుద్ర ఆంజనేయులును అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో విదేశీ పర్యాటక బృందానికి గైడ్ మధు మార్గదర్శనం చేశారు. భూదానోద్యమ చారిత్ర నేపథ్యాన్ని తెలుసుకున్నారు. భూదాన్ గంగోత్రి ప్రాంగణాన్ని సందర్శించి భూదానోద్యమ చారిత్రక ఘట్టాలను మ్యూజియంలోని ఫొటో గ్యాలరీని వీక్షించి తెలుసుకున్నారు.

బీఆర్ఎస్ నిరసనలు



ఎల్ఆర్ఎస్‌పై ఫీజును నిరసిస్తూ జిల్లా కేంద్రంలో రోడ్డుపై బైఠాయించి ఆందోళన నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

•8లో..

గుట్టలో శాస్త్రోక్తంగా ధ్వజారోహణం

- ఏకాదశి లక్షపుష్పార్చనలు
- నిత్య ఆదాయం రూ.15.75లక్షలు



ధ్వజారోహణ పూజా పర్వాలు నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, మార్చి 6: యాదగిరికొండపైన అనుబంధ ఆలయం రామలింగేశ్వరుడి సన్నిధిలో శివరాత్రి మహోత్సవాల్లో భాగంగా రెండో రోజు బుధవారం ఉదయం ధ్వజారోహణం సాయంత్రం భేరిపూజ, దేవతాహ్వాన పర్వాలు శైవాగమ శాస్త్రరీతిలో వైభవంగా కొనసాగాయి. శివాలయంలోని మూలమూర్తులను ఆరాధించిన అర్చకులు శివరాత్రి మహోత్సవాల్లో వైశేషిక ఘట్టం ధ్వజారోహణ పర్వాలకు సంప్రదాయరీతిలో నిర్వహించారు. శ్వేత వస్త్రంపై పరమేశ్వరుడి ఇష్టవాహనమైన నందీశ్వరుడి చిత్రపటాన్ని చిత్రించిన పూజారులు ప్రత్యేక వేద మంత్ర పఠనాలతో అర్చించి ధ్వజస్తంభంపైకి ఆరోహణ గావించారు. ఉత్సవాలకు ముక్కోటి దేవతాగణాలను ఆహ్వానించే పర్వం భేరీపూజ, దేవతాహ్వాన పర్వాలు చేపట్టిన పూజారులు ఉత్సవాల్లో ఆయా దేవతలకు హవిస్సులను అందజేసేందుకు యాగశాలలో అగ్ని ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం వేళ సోమకుంభార్చనలు, నమక, చమక, వేద మంత్ర పారాయణం జరిగింది. ఈ విశేష పర్వాలను దేవస్థాన ప్రధాన పురోహితుడు గౌరిభట్ల సత్యనారాయణశర్మ, శివాలయ ప్రధానార్చకుడు గౌరిభట్ల నరసింహరామశర్మ, అర్చకబృందం నిర్వహించింది. ఆలయఅనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

యాదగిరిగుట్ట లక్ష్మీనృసింహుడి సన్నిధిలో బుధవారం ఏకాదశి పర్వదినం పురస్కరించుకొని లక్షపుష్పార్చన పూజలు సంప్రదాయరీతిలో కొనసాగాయి. ప్రధానాలయ అష్టభుజి ప్రాకార మండపంలో హోమం, నిత్య తిరుకల్యాణోత్సవం ఆగమ శాస్త్రరీతిలో నిర్వహించారు. మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ యాదగిరీశుడిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ.15,75,110ల ఆదాయం సమకూరినట్లు దేవస్థాన అధికారులు తెలిపారు.

కొండంతా కట్టుదిట్ట భద్రతా ఏర్పాట్లు

- రాచకొండ సీపీ డాక్టర్ తరుణ్‌జోషి
- యాదగిరీశుడి సన్నిధిలో పూజలు



కొండపైన ప్రధానాలయ తిరువీధులను పరిశీలిస్తున్న సీపీ తరుణ్‌జోషి

యాదగిరిగుట్ట, మార్చి6: యాదగిరీశుడి వార్షిక బ్రహ్మోత్సవాల్లో కొండంతా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయనున్నట్లు రాచకొండ పోలీస్ కమిషనర్ డాక్టర్ తరుణ్‌జోషి అన్నారు. బుధవారం ఆయన యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రాన్ని సందర్శించారు. క్షేత్ర సందర్శనకు విచ్చేసిన ఆయనకు అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆయన ప్రధానాలయంలోని స్వయంభువులను దర్శించుకుని ముఖమండపంలో ఉత్సవమూర్తుల వద్ద సువర్ణ పుష్పార్చన పూజల్లో పాల్గొన్నారు. ప్రాకార మండపంలో అర్చకులు ఆయనకు ఆశీర్వచనం నిర్వహించారు. దేవస్థాన అధికారులు ఆయనకు స్వామివారి అభిషేకం లడ్డూ ప్రసాదాలను అందజేశారు. అనంతరం కొండపైన ఆలయ పరిసర ప్రాంతాల్లో డీసీపీ రాజేశ్‌చంద్రతో కలిసి కలియదిరిగారు. ఈ నెల 11 నుంచి 21వ తేదీ వరకు కొనసాగే యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు అధిక సంఖ్యలో భక్తులు, పలువురు ప్రముఖులు విచ్చేసే అవకాశాలు ఉన్నాయన్నారు. కొండపైన, కొండకింద ఆలయ పరిసరాల్లో భద్రతను కట్టుదిట్టం చేయాలని సూచించారు. ఎప్పటికప్పుడు డాగ్, బాంబ్ స్క్వాడ్ సిబ్బందితో తనిఖీలు చేపట్టాలని, కొండంతా సీసీ కెమెరాలతో నిఘాను అప్రమత్తం చేయాలని, కొండపైన కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా నిఘా వ్యవస్థను మానిటరింగ్ చేయాలన్నారు. అన్ని శాఖల సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వర్తించి ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు కొనసాగేలా ఏర్పాట్లు చేయాలన్నారు. ఆయనవెంట గుట్ట ఏసీపీ రమేశ్‌కుమార్, సిబ్బంది తదితరులున్నారు.

యాదగిరిగుట్ట రూరల్, ఆలేరు రూరల్: యాదగిరిగుట్ట రూరల్, ఆలేరుపోలీస్‌స్టేషన్లను తరుణ్ జోషి బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రజలకు అందిస్తున్న సేవలను సిబ్బంది పని తీరును అడిగి తెలుసుకున్నారు. ఆయనవెంట డీసీపీ రాజేష్ చంద్ర, అదనపు డీసీపీ లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.

పెద్దన్న మోదీతోనే మాదిగలకు న్యాయం

- మాదిగలను కాంగ్రెస్, బీఆర్ఎస్ మోసగించాయి
- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ



సమావేశంలో మాట్లాడుతున్న మందకృష్ణమాదిగ

భువనగిరి టౌన్, మార్చి 6: మాదిగలను అనాదిగా కాంగ్రెస్, బీఆర్ఎస్ మోసగిస్తున్న నేపథ్యంలో దేశ పెద్దన్న, ప్రధాని నరేంద్రమోదీతోనే మాదిగలకు న్యాయం జరుగుతుందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అన్నారు. జిల్లా కేంద్రంలో బుధవారం జరిగిన ఎమ్మార్పీఎస్ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలో ఉన్నప్పటికీ కాంగ్రెస్, బీఆర్ఎస్ ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదం కోసం అణువంత కృషి కూడా చేయలేదని విమర్శించారు. మాదిగలకు జరుగుతున్న నష్టాన్ని తీర్చే లక్ష్యంతో ప్రధాని నరేంద్రమోదీ ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించేందుకు చేపట్టిన చట్టపరమైన చర్యలు, హైదరాబాద్‌లో జరిగిన మాదిగల శంఖారావ సభలో నేరుగా పాల్గొన్న తీరు మాదిగల అభివృద్ధికి ఆయన చూపుతున్న శ్రద్ధను తెలియజేస్తున్నదన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి మాదిగలు అండగా నిలిచి పెద్దన్న మోదీని మూడోసారి ప్రధాని చేయాలని కోరారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీ డాక్టర్ బూర నర్సయ్యగౌడ్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు దుబ్బ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

స్వదేశీ దర్శన్‌లో భువనగిరి ఖిల్లా అభివృద్ధి

- నేడు వర్చువల్‌గా పనులను ప్రారంభించనున్న ప్రధాని

భువనగిరి అర్బన్, మార్చి 6: భారత ప్రభుత్వ ఆధ్వర్యంలో స్వదేశీ దర్శన్ 2.0 పథకం కింద మొదటి విడతగా రూ.69కోట్లు మంజూరయ్యాయని, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వర్చువల్ ద్వారా ఈనెల 7న ఉదయం 11 గంటలకు ప్రారంభించనున్నట్లు యువజన, క్రీడలు అధికారి ధనుంజనేయులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర టూరిజం శాఖ మినిస్ట్రీ ఆఫ్ టూరిజం అసిస్టెంట్ డైరెక్టర్ మౌతోషి నాస్కర్, జనరల్ మేనేజర్ మందడి ఉపేందర్‌రెడ్డి, డిప్యూటీ మేనేజర్ జీవీ నేత్ర, జిల్లా టూరిజం అధికారులతో కలిసి కలెక్టర్ హనుమంతు కే.జెండగేను కలిశారని, ఎల్ఎన్‌టీ అధికారులు భువనగిరి ఖిల్లాకు సంబంధించి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ కూడా ఇవ్వనున్నట్లు తెలిపారు. దీనికి సంబంధించి కలెక్టరేట్‌లో ప్రొజెక్టర్‌ను ఏర్పాటు చేశామని, ఈ కార్యక్రమానికి జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు, హాజరవుతున్నట్లు వివరించారు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

నల్లగొండ టౌన్, మార్చి 6 : పార్కింగ్ చేసిన లారీల్లో డీజిల్ దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠాను నల్లగొండ జిల్లా మిర్యాలగూడ డివిజన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.వారి నుంచి రూ.6 లక్షల నగదు, 700 లీటర్ల డీజిల్, మూడు ఇన్నోవా, ఒక కారును స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్‌రాజు వివరాలను వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా సీతారాంపురంతండాకు చెందిన బాణవత్ బాలబద్దునాయక్, బాణవత్ గోవింద్‌నాయక్, మేరజుత్ శ్రీనునాయక్, ముడావత్ వెంకటేశ్వర్లు, మేరజుత్ బాబ్రీనాయక్‌లు వ్యవసాయం చేస్తూనే జల్సాలకు అలవాటు పడి సులభమార్గాలలో డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో దొంగతనాలను ప్రారంభించారు. కొంతకాలంగా నల్లగొండ, సూర్యాపేట జిల్లాలోని రహదారుల వెంట పార్కింగ్ చేసిన లారీలే లక్ష్యంగా, డ్రైవర్లు నిద్ర మత్తులో ఉన్న సమయంలో ట్యాంక్ నుంచి డీజిల్‌ను దొంగిలించేవారు. దొంగిలించిన డీజిల్‌ను తమ వెంట తెచ్చుకున్న ఇన్నోవా, కారులో ఆంధ్రప్రదేశ్‌కు తరలించి అక్కడే విక్రయించి సొమ్ముచేసుకునేవారు. ఈ క్రమంలో నేరడుగొమ్మకొత్తపల్లి గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ వడ్త్యా రాజునాయక్‌తో వీరికి పరిచయం ఏర్పడింది. ఈ ముఠా దొంగిలించిన డీజిల్‌ను స్థానికంగా విక్రయించేందుకు రాజునాయక్‌తో మధ్యవర్తిత్వం కుదుర్చుకుని గడిచిన నెలరోజులుగా దొంగిలించిన 1,500లీటర్ల డీజిల్‌ను దామరచర్ల మండలం కొండ్రపోల్ గ్రామానికి చెందిన నేనావత్ టాకునాయక్‌కు విక్రయించారు. పెట్రోలింగ్‌లో భాగంగా బుధవారం తెల్లవారుజామున వాడపల్లి పోలీసులు ఆర్‌టీఏ బార్డర్ చెక్‌పోస్టు వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా ఇన్నోవా వాహనాల్లో ఏపీ వైపునకు వెళ్తున్న ఆరుగురిని అదుపులోకి తీసుకొని విచారించగా నేరాలను అంగీకరించారు. వారి వద్ద నుంచి వాహనాలతో పాటు రూ.6లక్షల నగదు, డీజిల్ దొంగతనాలకు ఉపయోగించే సామాగ్రిని స్వాధీనం చేసుకున్నారు. వారిచ్చిన సమాచారం మేరకు మరో ఇన్నోవా, కారుతో పాటు టాకునాయక్ నుంచి 700 లీటర్ల డీజిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో సీతారాంపురం గ్రామానికి చెందిన ఐదుగురితో పాటు నేరడుగొమ్మకొత్తపల్లి గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ వడ్త్యా రాజునాయక్‌ను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. కాగా దొంగిలించిన డీజిల్‌ను కొనుగోలు చేసిన దామరచర్ల మండలం కొండ్రపోల్ గ్రామానికి చెందిన నేనావత్ టాకునాయక్ పరారీలో ఉన్నాడు.

వాడిపోతున్న పండ్ల తోటలు!

నల్లగొండ జిల్లాలో బత్తాయి, నిమ్మతోటలకు నీటిగండం.. అడుగంటిన భూగర్భ జలాలు

- పంట నష్టం రూ.180 కోట్ల దాకా
- సర్కారు చొరవ చూపాలని రైతుల వినతి

నల్లగొండ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నల్లగొండ జిల్లాలో పండ్లతోటల రైతులకు నీటిగండం వెంటాడుతోంది. భూగర్భజలాల నీటిమట్టాలు రోజురోజుకీ పడిపోతుండటంతో వాటి ఆధారంగా సాగు చేసిన బత్తాయి, నిమ్మతోటలకు తీవ్ర నీటికొరత ఏర్పడింది. కనగల్లు మండలం చర్లగౌరారం, గుర్రంపోడు మండలం పోచంపల్లి సహా జిల్లావ్యాప్తంగా సుమారు 60వేల ఎకరాల్లో బత్తాయి, మరో 12 వేల ఎకరాల్లో వేసిన నిమ్మతోటలు నీరందక వాడిపోతున్నాయి. తోటలను కాపాడుకోవాలనే ఆశతో రైతులు లెక్కకుమిక్కిలిగా బోరుబావులు తవ్వుతున్న పరిస్థితి జిల్లా వ్యాప్తంగా ఏర్పడింది. నాన్ ఆయకట్టు ప్రాంతాలైన నల్లగొండ, దేవరకొండ డివిజన్లతో పాటు, మిర్యాలగూడ డివిజన్‌లోని మెట్ట ప్రాంతాల్లో ఈ కరువు పరిస్థితి కనిపిస్తోంది. జిల్లాలోని మెట్ట ప్రాంతాల్లో దాదాపు 300 నుంచి 500 అడుగుల లోతువరకు బోర్లు తవ్వినా, నీరు కనిపించకపోవడంతో రైతాంగం నైరాశ్యంలో మునిగింది. పండ్ల తోటలను సంరక్షించుకునేందుకు రైతులు ఒక్కొక్కరు 10, 20 వరకు బోర్లు వేస్తూ ఆర్థికంగా మరింత దెబ్బతింటున్న పరిస్థితి నెలకొంది. ఇదే పరిస్థితి కొనసాగితే జిల్లావ్యాప్తంగా బత్తాయి, నిమ్మ రైతులు సుమారు రూ.180 నుంచి రూ. 200 కోట్ల వరకు నష్టపోవాల్సి వస్తుందని చెబుతున్నారు. చెట్లు కూడా ఎండిపోతే మరింత నష్టపోవాల్సి ఉంటుందని, 10, 15 ఏళ్ల పాటు చేసిన శ్రమంతా వృథా అవుతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఏఎమ్మార్పీ, వరద కాల్వల ద్వారా వీలైనన్ని చెరువులను నీటితో నింపితే భూగర్భజలాలు అందుబాటులోకి వస్తాయని, తద్వారా పంట నష్టపోయినా.. తోటలైనా దక్కుతాయని, ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. సాగర్‌లో నిల్వలు లేనందున ఎగువన ఉన్న ఆల్మట్టి నుంచి నీటిని విడుదల చేయిస్తే ఆదుకున్నట్లవుతుందని, ఈ మేరకు ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని రైతులు కోరుతున్నారు.

పశువుల మేతగా వరి పొలం

కూసుమంచి: యాసంగిలో వరి సాగు చేయొద్దని అధికారులు సూచించినా చాలామంది రైతులు పాలేరు పాతకాల్వ ఆయకట్టులో వరిసాగు చేశారు. అయితే పంట చివరి దశకు వచ్చిన ప్రస్తుత సమయంలో నీరు అందకపోవడంతో వరిపొలాలు ఎండిపోతున్నాయి. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం జక్కేపల్లి, పెరికశింగారంలో వరిపొలాలకు సాగునీరు అందకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయి. పాలేరు నుంచి నీరు విడుదల చేయాలని రైతులు మొన్నటిదాకా ఆందోళనలు చేశారు. అధికారులు స్పందించకపోవడంతో పాతకాల్వ పరిధిలో ఎండిపోతున్న వరి పొలాల్లో రైతులు తమ పశువులను మేపుతున్నారు.



నల్లగొండ జిల్లా చిన్నఅడిశర్లపల్లిలో బోరుబావి నీళ్లు తగ్గడంతో వచ్చే కొద్దినీటిని పైపుల ద్వారా బత్తాయి చెట్లకు పోస్తున్న రైతు కూరలింగయ్య

చెరువులు నింపే కార్యాచరణ చేపట్టాలి



నాకు ఆరెకరాల బత్తాయి తోట ఉంది. భూగర్భజలాలు అడుగంటడంతో గతంలో ఉన్న బోరుబావులు నీరు పోయడం లేదు. నీళ్లందక తోట వాడిపోతోంది. ఇటీవల మూడు బోర్లు వేయించాను. చివరి బోరు 500 ఫీట్లవరకు వేసినా చుక్కనీరు రాలేదు. తోట ఎండితే భారీగా నష్టపోవాల్సి వస్తుంది. ప్రభుత్వం తక్షణమే ఏఎమ్మార్పీ ద్వారా చెరువులు నింపేందుకు చర్యలు తీసుకోవాలి.

- పోలేని యాదయ్య, బత్తాయి రైతు, పోచంపల్లి, నల్లగొండ

నీళ్లు లేక నిమ్మతోట ఎండుతోంది



నాకు రెండు ఎకరాల నిమ్మతోట ఉంది. మరో నాలుగెకరాల్లో వరి కూడా వేశాం. గతంలో నాలుగు బోర్లుంటే ఎండిపోయాయి. ఇటీవల మళ్లీ నాలుగు బోర్లు వేసినా చుక్క నీరు పడలేదు. నిమ్మతోట ఎండిపోతే ఎకరాకు కనీసం లక్షవరకు నష్టపోవాల్సి వస్తుంది. ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలు తీసుకొని మమ్మల్ని ఆదుకోవాలి.

- సత్తిరెడ్డి, నిమ్మరైతు, చర్లగౌరారం, నల్లగొండ జిల్లా

నాలుగు పర్యాటక ప్రాజెక్టులకు


నేడు ప్రధాని శంకుస్థాపన

హైదరాబాద్/వికారాబాద్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో రూ.137.76 కోట్ల అంచనా వ్యయంతో రాష్ట్రంలో చేపట్టనున్న నాలుగు పర్యాటక ప్రాజెక్టులకు ప్రధాని నరేంద్ర మోదీ గురువారం మధ్యాహ్నం శంకుస్థాపన చేయనున్నారు. ఆలంపూర్‌లోని జోగులాంబ ఆలయం, భువనగిరి జిల్లాలోని భువనగిరి కోట, వికారాబాద్ జిల్లాలోని అనంతగిరి కొండలు, హైదరాబాద్‌లోని బల్కంపేట ఎల్లమ్మ ఆలయం వద్ద చేపట్టే వివిధ అభివృద్ధి పనులను మోదీ వర్చువల్‌గా ప్రారంభిస్తారు. స్వదేశీ దర్శన్, ప్రసాద్ పథకాల కింద దేశ వ్యాప్తంగా 52 పర్యాటక కేంద్రాలను ఎంపిక చేసిన కేంద్రం దాదాపు రూ.1325.76 కోట్ల వ్యయంతో ఆయా ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టనుంది. ఇందులో భాగంగా ఆలంపూర్‌లోని జోగులాంబ ఆలయం అభివృద్ధికి, వసతుల కల్పనకు ప్రసాద్ పథకం కింద రూ.38.90 కోట్లు కేటాయించింది. అలాగే, భువనగిరి కోట ప్రాంతంలో విశ్రాంతి భవనాలు, పార్కులు, హరితవనాల అభివృద్ధికి, కోటపైకి చేరుకునేందుకు రోప్‌వే నిర్మాణానికి తొలి దశలో రూ.56.81 కోట్లు కేటాయించింది. హైదరాబాద్‌లోని బల్కంపేట ఎల్లమ్మ ఆలయ ప్రాంతంలో భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పనకు ప్రసాద్ పథకం కింద రూ.4.05 కోట్లు కేటాయించారు. తెలంగాణ ఊటీగా ఖ్యాతి పొందిన అనంతగిరి కొండలు, అక్కడి అటవీ ప్రాంతాల్లో వసతుల కల్పనకు రూ.38 కోట్లు కేటాయించారు. ఆయా పనులు గురువారం ప్రారంభం కానున్నాయి. అనంతగిరి కొండలను ఎకో టూరిజం హబ్‌గా తీర్చిదిద్దనున్నారు. ఇందులో భాగంగా మొత్తం రూ.98 కోట్లతో అభివృద్ధి పనులను నాలుగు ప్యాకేజీలుగా చేపట్టనున్నారు.

తాగునీటికి కష్టమే!

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్ తాగునీటి అవసరాలకే తరలించాలని మంత్రి పొన్నం తాజాగా అధికారులను ఆదేశించినా.. ఆ నీళ్లలో గరిష్ఠంగా ఏడు టీఎంసీల దాకానే వచ్చే అవకాశం ఉండటంతో పట్నంలో ఈ వేసవిలో తాగునీటికి కటకట తప్పదనే అంచనాలకు బలం చేకూరుతోంది. బుధవారం సచివాలయంలో జీహెచ్ఎంసీ, వాటర్‌బోర్డు తదితర విభాగాల అధికారులతో బీసీ సంక్షేమ శాఖ, హైదరాబాద్ జిల్లా ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్ష నిర్వహించారు. హైదరాబాద్ పరిధిలో నీటి ఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆయన ఆదేశించారు. కృష్ణా, గోదావరి బ్యారేజీల్లో ఉన్న నీటి మట్టాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ తదనుగుణంగా ఏర్పాట్లు చేయాలన్నారు. హైదరాబాద్ తాగునీటి అవసరాల కోసం ఎల్లంపల్లి నుంచి 10 టీఎంసీలు వినియోగించుకోవాలని సూచించారు. ఎల్లంపల్లి నీటిని గజ్వేల్, దుబ్బాక, సిద్దిపేటకు ఇవ్వకుండా హైదరాబాద్‌కు తరలిస్తున్నారనే ప్రచారంలో వాస్తవం లేదని చెప్పారు. నీటి సరఫరా, రంజాన్‌లో ఏర్పాట్లు, వర్షాకాలంలో ముంపు ముప్పు నివారణ చర్యలపై అధికారులతో చర్చించి పలు సూచనలు చేశారు. 2017 అనంతరం ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు నెలకొన్నా, నగరంలో తాగునీటికి ఇబ్బందులు లేవని మంత్రికి అధికారులు వివరించారు. వేసవితో పాటు రంజాన్ మాసంలో అవసరాల కోసం నీటి ట్యాంకర్లు 24 గంటలు సరఫరా చేసేలా ఏర్పాట్లు చేసుకోవాలని, ఇందుకు ఆర్థిక ఇబ్బందులుంటే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని పొన్నం చెప్పారు. విద్యా సంవత్సరం ప్రారంభమయ్యేలోపు తాగునీరు, ఇతరత్రా వసతులకు సంబంధించిన చర్యలు చేపట్టాలన్నారు. గతంలో జరిగిన ఘటనలను దృష్టిలో ఉంచుకొని వర్షాకాలంలో ముంపు ముప్పు, ప్రాణ నష్టం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. మ్యాన్ హోల్‌లు తెరిచి ఉంటే ప్రమాదకరం అని, అలాంటి చోట్ల సిబ్బంది పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సచివాలయం ముందు భారీగా వరద నీరు నిలుస్తోందని అధికారులు చెప్పడంతో ఆర్ అండ్ బీ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారనికి చొరవ తీసుకుంటామని పేర్కొన్నారు. నగరంలో ట్రాఫిక్ సమస్యలు లేకుండా పోలీసులు సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఎన్నికల కోడ్ రాక ముందే ప్రారంభించే పనులుంటే ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని చెప్పారు.



ఎల్లంపల్లి ప్రాజెక్టు (ఫైల్)

ఎల్లంపల్లి నీరొచ్చినా దాహ'మే'!

శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు అడుగంటుతోంది. పదేళ్లుగా ఎప్పుడూ లేని విధంగా ఈ ఏడాది నీటి నిల్వలు భారీగా పడిపోయాయి. మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోవడంతో కాళేశ్వరం నుంచి నీటి లభ్యత కూడా లేకుండాపోయింది. ప్రాజెక్టుకు తక్షణ నీటి సరఫరాకు అనుగుణంగా ఉండే కడెం ప్రాజెక్టులో కూడా నీటి నిల్వలు అడుగంటాయి. మార్చి 2వ తేదీ లెక్కల ప్రకారం 10.48 టీఎంసీల నీరే ఉంది. ఇక 7.66 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం కలిగిన కడెంలో ప్రస్తుతం 3.88టీఎంసీల నీరే ఉంది. ఇందులో డెడ్ స్టోరేజీ కింద 2.8 టీఎంసీలను మినహాయిస్తే ప్రాజెక్టు నుంచి ఒక టీఎంసీ మాత్రమే ఎల్లంపల్లికి తీసుకునే అవకాశం ఉంది. పైగా ఎల్లంపల్లి ప్రాజెక్టులో నాలుగు టీఎంసీల కన్నా ఎక్కువ ఉంటేనే హైదరాబాద్‌కు నీటిని సరఫరా చేసేలా పంప్‌హౌస్‌ను ఏర్పాటు చేశారు. అంటే ఎల్లంపల్లికి కడెం నుంచి ఓ టీఎంసీ నీరు విడుదల చేసినా గరిష్ఠంగా ఏడు టీఎంసీలనే హైదరాబాద్‌కు తరలించే అవకాశం ఉంటుంది. ఈ నీళ్లు మార్చి, ఏప్రిల్ మాసాల్లో హైదరాబాద్‌కు తాగునీటి అవసరాలు తీరుతాయని.. మే, జూన్ నెలల్లో మాత్రం తాగునీటికి కటకట తప్పదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నాగార్జున సాగర్‌లో కూడా 515 లెవల్ వరకు నీళ్లు ఉన్నాయి. ఈ నీళ్లు మరో 5 ఫీట్ల మేర పడిపోతే హైదరాబాద్‌కు నీటి సరఫరా తగ్గొచ్చని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి

శ్రీరాంసాగరే దిక్కు

ఎండాకాలంలో హైదరాబాద్ తాగునీటి అవసరాల కోసం శ్రీరాంసాగరే ప్రత్యామ్నాయంగా కనిపిస్తోంది. శ్రీరాంసాగర్‌లో 40టీఎంల నీటి నిల్వలున్నాయి. ప్రధానంగా ఇక్కడి నీటిని సాగు అవసరాలకే వాడుతున్నారు. శ్రీరాంసాగర్ నుంచి ఎల్లంపల్లికి నీటిని విడుదల చేస్తే తాగునీటి గండం నుంచి గట్టెక్కొచ్చు. అయితే ఈ విషయంలో నీటిపారుదల శాఖ అధికారులు స్పందించకపోవడం హైదరాబాద్ వాటర్‌వర్క్స్ అధికారులను ఆందోళనకు గురిచేస్తోంది. సీఈలు, ఎస్ఈల స్థాయిల్లో చర్చకు పెట్టినా ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌లో చలనం లేకపోవడం కలవరపెడుతోంది.

కాలుష్య నియంత్రణ బోర్డులో

అవినీతి అధికారులు

- మండిపడిన హైకోర్టు
- సుమోటోగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సూచన

హైదరాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (టీపీసీబీ)లో అవినీతి అధికారులు ఉన్నారంటూ హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. పీసీబీని సంపూర్ణ ప్రక్షాళన చేసే దిశగా ఇలాంటి అధికారులపై సుమోటోగా చర్యలు చేపట్టాలని ప్రభుత్వానికి సూచించింది. రంగారెడ్డి జిల్లా గగన్‌పహాడ్‌లో ఉన్న ఫ్రోస్టర్స్ అనే కంపెనీకి జాయింట్ చీఫ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ జారీచేసిన కంపెనీ మూసివేత నోటీసును హైకోర్టు కొట్టేసింది. వాటర్ (ప్రివెన్షన్ అండ్ కంట్రోల్ ఆఫ్ పొల్యూషన్) యాక్ట్ - 1988 ప్రకారం ఎందుకు చర్యలు తీసుకోరాదో వివరించాలని ఆ పీసీబీ అధికారి పిటిషనర్ కంపెనీకి షోకాజ్ నోటీసులు జారీచేశారు. చట్టంలోని నిబంధన ప్రకారం ప్లాస్టిక్ వాషింగ్ యూనిట్‌కు అనుమతి అవసరం లేదంటూ ఆ కంపెనీ సమాధానం ఇచ్చింది. కంపెనీ ఇచ్చిన వివరణను పట్టించుకోకుండా, తమ నోటీసులకు ఎలాంటి సమాధానం ఇవ్వలేదని పేర్కొంటూ అధికారి క్లోజర్ ఆదేశాలు జారీచేశారు. మూసివేత ఆదేశాలను సవాల్ చేస్తూ కంపెనీ హైకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌పై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. 'రాష్ట్ర ప్రభుత్వ వ్యవహారాల్లో ఇదో బాధాకరమైన విషయం. పొల్యూషన్ కంట్రోల్ బోర్డులోని అవినీతి అధికారులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి. పీసీబీ వ్యవస్థను పారదర్శకంగా మార్చాలి. గత ఏడునెలలుగా మేం పీసీబీ పనితీరును గమనిస్తున్నాం. కొంత మంది అధికారులు షోకాజ్ నోటీసులు ఇస్తారు.. మరి కొంత మంది అధికారులు వచ్చి ఎలాంటి సమాధానం రాలేదంటూ తుది ఆదేశాలు ఇస్తారు. సామర్థ్యం లేని అధికారులను మారుమూల ప్రాంతాలకు బదిలీ చేయాలి' అని వ్యాఖ్యానించింది. సహజ న్యాయసూత్రాలకు విరుద్ధంగా జారీచేసిన మూసివేత ఉత్తర్వులు చెల్లవని పేర్కొంటూ వాటిని కొట్టేసింది. ఈ పనిని వేరే అధికారికి అప్పగించి.. 15 రోజుల్లో తాజా ఆదేశాలు జారీచేయాలని స్పష్టం చేసింది. 15 రోజుల్లో తాజా ఆదేశాలు ఇవ్వకపోతే కోర్టు ధిక్కరణ చర్యలు చేపడతామని స్పష్టం చేసింది.

ఎల్‌ఆర్‌ఎస్‌పై బీఆర్‌ఎస్ రాజకీయం!

- కేటీఆర్‌కు కోదండరెడ్డి ప్రశ్న

హైదరాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఎల్‌ఆర్‌ఎస్‌పై బీఆర్‌ఎస్ పార్టీ రాజకీయం చేస్తోందని... ఆ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు అక్రమ లే అవుట్లు వేస్తుంటే నిద్రపోయారా అని కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి ప్రశ్నించారు. ఎల్‌ఆర్‌ఎస్‌పై ఇచ్చిన రెండు జీవోలూ గత ప్రభుత్వం ఇచ్చినవేనని, కేటీఆర్ మంత్రిగా ఉన్నప్పుడు ఇచ్చిన ఆ జీవోల్లోనే ధరలూ నిర్ణయించారన్నారు. గాంధీ భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కోదండరెడ్డి మాట్లాడుతూ అధికారంలో ఉన్నప్పుడు అమాయక ప్రజల నుంచి డబ్బులు లాక్కునే ప్రయత్నం చేసిన కేటీఆర్.. ఇప్పుడేమో ఉచితంగా రెగ్యులరైజ్ చేయాలంటూ చెబుతున్నారన్నారు. హౌసింగ్ బోర్డు ద్వారా పేదలకు ఇళ్లు ఇచ్చింది కాంగ్రెస్ పార్టీనే అన్నారు. కోకాపేటలో పేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం భూమి ఇస్తే.. కేసీఆర్ వాటిని లాక్కుని బిల్డర్లకు ఇచ్చారన్నారు. ఔటర్ రింగ్ రోడ్డును ప్రైవేటు కంపెనీకి అప్పగించేశారన్నారు. జీవో 111 పరిధిలోని భూములనూ ఆక్రమించారన్నారు. వీటన్నిటిపైనా విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

బీఆర్‌ఎస్ బలహీనపడింది

- పొత్తులతో అది స్పష్టం: నిరంజన్

హైదరాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): బీఎస్పీతో పొత్తు పెట్టుకోవడం ద్వారా బీఆర్‌ఎస్ పార్టీ ఎంత బలహీనపడిందో స్పష్టమైందని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు నిరంజన్ అన్నారు. బీఆర్‌ఎస్ నేతలు ఆ పార్టీని వీడి వెళుతుండడంతో ఉనికిని కాపాడుకునేందుకు కేసీఆర్ నానా తంటాలు పడుతున్నారన్నారు. నిబద్ధత గల అధికారిగా పేరున్న ప్రవీణ్‌కుమార్‌కూ ఇది ఒక చెరగని మచ్చ అన్నారు. దళితుడిని తెలంగాణకు తొలి సీఎంగా చేస్తానని చెప్పి మాట తప్పినందుకు కేసీఆర్ పంచన చేరారా... అంటూ ప్రవీణ్‌కుమార్‌ను ప్రశ్నించారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డిని ఏక్‌నాథ్ షిండేగా పేర్కొంటున్న కేటీఆర్.. హింసించే రాజు 23వ పులకేశి అంటూ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కైలాష్ నేత ధ్వజమెత్తారు. బీఆర్‌ఎస్‌ను కేసీఆర్ హోల్‌సేల్‌గా బీజేపీకి అమ్మకానికి పెట్టారన్నారు. ప్రవీణ్‌కుమార్‌ని పెంచి పోషించింది బీఆర్‌ఎస్ పార్టీనేనని, అది ఇప్పుడు బట్టబయలైందని అన్నారు. గాంధీభవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఈమేరకు మాట్లాడారు.

గాంధీభవన్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గాంధీభవన్‌లో బుధవారం మహిళాకాంగ్రెస్ ఆధ్వర్యంలో వేడుక జరిగింది. మహిళా కాంగ్రెస్ నేతలు భారీ కేక్‌ను కట్ చేసి ఆనందాన్ని పంచుకున్నారు. ఈ వేడుకల్లో మంత్రి కొండా సురేఖ, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి ఓటర్ల వివరాలు ఇవ్వండి

- ఎన్నికల అధికారులకు హైకోర్టు ఆదేశాలు

హైదరాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): చేవెళ్ల పార్లమెంటరీ నియోజకవర్గంలో పోలింగ్ స్టేషన్‌ల వారీగా ఇంటినంబర్లతో కూడిన మ్యాప్ (నజ్రీ నక్ష)లను మాజీ ఎంపీ, ఆ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి అందజేయాలని ఎన్నికల అధికారులకు హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ గతేడాది జారీచేసిన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్‌వోపీ) ప్రకారం నజ్రీ నక్ష అందజేయాల్సి ఉండగా అందుకు ఎన్నికల అధికారులు నిరాకరిస్తున్నారని పేర్కొంటూ ఆయన హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది ఎల్. రవిచందర్ వాదనలు వినిపిస్తూ.. చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గంలో 2.40 లక్షల మంది నకిలీ ఓటర్లు ఉన్నారని.. హైదరాబాద్‌లో 1.65 లక్షల మంది వరకు ఉన్నారని ఆరోపించారు. ఎన్నికల అధికారులు ఇంటి నెంబర్లతో కూడిన నజ్రీ నక్షలను బయటపెట్టకపోవడం వల్ల ఓటర్ల జాబితాలో అక్రమాలకు అవకాశం ఏర్పడుతోందని పేర్కొన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం తరఫు సీనియర్ న్యాయవాది అవినాశ్ దేశాయి వాదనలు వినిపిస్తూ.. ఫొటోలతో కూడిన డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా, ప్రతి పోలింగ్ స్టేషన్ పరిధిలోని ఏరియాను ప్రతిబింబించే నజ్రీ నక్షను ఆయా రాజకీయ పార్టీలకు ఎన్నికల అధికారులు అందజేస్తారని పేర్కొన్నారు. తగిన మొత్తంలో రుసుము చెల్లిస్తే పిటిషనర్‌కు నక్ష అందజేయడానికి అభ్యంతరం లేదని పేర్కొన్నారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. ఖర్చులు స్వీకరించి పిటిషనర్ కోరిన విధంగా నజ్రీ నక్ష అందజేయాలని ఆదేశించింది.

సీడ్ కార్పొరేషన్‌లో సిత్రాలెన్నో!

(మొదటి పేజీ తరువాయి)

ఆర్భాటంగా ప్రకటించగా.. గడిచిన పదేళ్లలో విత్తనోత్పత్తి కాస్తా ఏటా నేలచూపులు చూస్తూ.. అథఃపాతాళానికి పడిపోయింది. విత్తనాల నాణ్యతను ధ్రువీకరించే 'సీడ్ సర్టిఫికేషన్ అథారిటీ'లోనూ అన్నీ అవకతవకలే..! ఇక్కడ సిబ్బంది బయోమెట్రిక్ ఉండదు. ఇద్దరు ఔట్‌సోర్సింగ్ సిబ్బంది అసలు విధుల్లోకే రారు. సంతకాలు చేయరు. తొమ్మిదేళ్లుగా జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ప్రిన్సిపల్ సైంటిస్ట్‌గా, సీడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ హెచ్‌వోడీగా, సీడ్ కార్పొరేషన్ ఎండీగా కె.కేశవులు పనిచేస్తున్నారు. ఈ తొమ్మిదేళ్లలో రికార్డు స్థాయిలో 28 విదేశీ పర్యటనలు చేశారు. ఏ ముఖ్యమంత్రి గానీ, మంత్రులు గానీ ఇన్ని విదేశీ పర్యటనలు చేయకపోవడం విశేషం. పైగా.. 2022 అక్టోబరులో నిర్వహించిన గ్రూప్-1 ప్రిలిమ్స్‌లో కె.కేశవులు స్వస్థలమేది? అంటూ ఓ ప్రశ్న రావడం గమనార్హం!

గ్రో ఔట్ టెస్ట్ నిధులెక్కడ?

విత్తనాభివృద్ధి కోసం గ్రో ఔట్ టెస్ట్(జీవోటీ) ఫామ్ కోసం కేంద్ర ప్రభుత్వం రూ.50 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.50 లక్షలను మ్యాచింగ్ గ్రాంట్ కింద అందజేశాయి. రాజేంద్రనగర్‌లోని జయశంకర్ వర్సిటీ ప్రాంగణంలో ఈ ఫామ్ ఏర్పాటుకు ప్రతిపాదనలు చేశారు. ఇప్పుడు అక్కడ పాడుబడ్డ ఓ గేటు, చెట్ల పొదలు, ముళ్ల కంపలు తప్ప.. అక్కడ ఫామ్ లేదు. అయితే.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలిచ్చిన రూ.కోటి నిధులు ఎక్కడ? అనేది ఇప్పుడు ప్రశ్నగా మారింది. ఒక్క విత్తన గింజను ఉత్పత్తిచేయకున్నా.. యూసీలు మాత్రం సమర్పించారు. తెలంగాణను 'సీడ్ బౌల్ ఆఫ్ ఇండియా'గా చేస్తామంటూ గత ప్రభుత్వం చేసిన ప్రకటన ఆర్భాటాలకే పరిమితమైంది. లక్షల నిధులు కేటాయించినా.. విత్తనోత్పత్తి పెరగకపోగా.. సీడ్ కార్పొరేషన్‌లో పదేళ్లుగా నేలచూపులు చూస్తోంది. ఎగుమతులు క్షీణించాయి. 2014-15లో సీడ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జరిగిన విత్తనోత్పత్తి 3.18 లక్షల క్వింటాళ్లు కాగా.. 2021-21లో 1.56 లక్షల క్వింటాళ్లు, 2022-23లో 1.78 లక్షల క్వింటాళ్లకు పడిపోయింది. విత్తన పంపిణీ 2014-15లో 3.36 లక్షల క్వింటాళ్లుగా ఉండగా.. 2022-23లో అది 3.05 లక్షల క్వింటాళ్లకు పడిపోయింది. సీడ్ సర్టిఫికేషన్ ఏజెన్సీలో రిజిస్ట్రేషన్లు కూడా గణనీయంగా పడిపోయాయి. 2015-16తో పోలిస్తే.. 2022-23కల్లా ఈ రిజిస్ట్రేషన్లు 1.65 లక్షల మేర తగ్గిపోయాయి.

ఇస్టా కాంగ్రెస్‌కు ఇష్టారాజ్యంగా నిధులు

హైదరాబాద్‌లో 2019 జూన్ నెలలో 32వ ఇస్టా కాంగ్రెస్ సదస్సును నిర్వహించారు. 75 దేశాల నుంచి 451 మంది ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరైనట్లు ఇస్టా కాంగ్రెస్ నోడల్ ఆఫీసర్‌గా వ్యవహరించిన టీఎస్-ఎస్‌వోసీఏ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కె.కేశవులు అప్పట్లో వెల్లడించారు. ఈ సదస్సు నిర్వహణకు అప్పట్లో 'రైతుబంధు' నిధులను మళ్లించినట్లు ఫిర్యాదులు వచ్చాయి. సుమారు రూ.10 కోట్ల నిధులను ఇస్టా కాంగ్రెస్ సదస్సుకు ఖర్చు చేశారు. ఇందులో పెద్దమొత్తంలో నిధులు దుర్వినియోగమైనట్లు ఆరోపణలున్నాయి. మూడు రోజులకు నోవాటెల్ హోటల్ హాలు, భోజనాలకే రూ.70 లక్షల ఖర్చు రాశారు. డెలిగేట్స్ గదులకు రూ.25 లక్షలు, స్టాల్స్ ఏర్పాటుకు రూ.43.12 లక్షలు, కార్నివాల్ ఏర్పాట్లకు రూ.20.37 లక్షలు, తాజ్ హోటల్స్‌లో ఫుడ్ అండ్ బేవరేజెస్‌కు రూ.26.34 లక్షలు, సాంస్కృతిక కార్యక్రమాలకు రూ.25.65 లక్షలు, ప్రచారానికి రూ.12 లక్షలు, హైటెక్స్‌లో స్టేజీ ఇతరత్రా ఏర్పాట్లకు రూ.20 లక్షలు, ఇస్టా వీడియో ఫిల్మ్‌లకు రూ.18 లక్షలు, ఎగ్జిబిటర్లు, అధికారుల ఫీజులకు రూ.52.75 లక్షలు, రైతుల సమావేశానికి రూ.56 లక్షలు, చిల్లర ఖర్చులకు రూ.15 లక్షలు వెచ్చించారు. చివరకు నోడల్ ఆఫీసర్ కేశవులు ఐ-ఫోన్ కోసం రూ.65 వేలను ఈ నిధుల్లోంచే ఖర్చుచేశారు. హైదరాబాద్‌లోని పలు స్టార్‌హోటళ్ల పేరుతో విచ్చలవిడిగా బిల్లులను సమర్పించారు. దీనిపై అప్పట్లో విమర్శలు వచ్చినా.. నాటి ప్రభుత్వం పట్టించుకోలేదు.

జీతం ఇక్కడ.. చేసేది ఆర్డర్లీ

సీడ్ సర్టిఫికేషన్‌లో ఉద్యోగంలో చేరిన ఇద్దరు ఔట్ సోర్సింగ్ సిబ్బంది.. విధులకు హాజరవ్వడం లేదు. బయోమెట్రిక్ వేయటం లేదు. ఒకరేమో హైదరాబాద్ లంగర్‌హౌస్‌లో నివాసముంటున్న ఏపీ మాజీ సీఎస్ ఇంట్లో పనిచేస్తున్నారు. మరొకరు ఆ మాజీ ఐఏఎస్ ఇంటిపక్కనే ఉండే సీడ్ కార్పొరేషన్ ఎండీ ఇంట్లో ఊడిగం చేస్తున్నట్లు సమాచారం. ఈ ఇద్దరు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఏడాదికోసారి తెల్లకాతాలపై సంతకాలు చేసి పంపుతున్నట్లు.. దాన్నే రెన్యూవల్ ఆఫ్ సర్వీసెస్‌గా అధికారులు రికార్డుల్లో పెడుతున్నట్లు తెలుస్తోంది.

ప్రైవేటు ఏజెన్సీతోనే ఆడిటింగ్

తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ, విత్తన ధ్రువీకరణ సంస్థకు సంబంధించిన ఆడిట్‌ను ఏటా ప్రైవేటు ఏజెన్సీలతోనే చేయించారు. ఒక 2021-22లో మాత్రమే ఏజీ ఆడిట్ జరిగింది. ఆర్‌కేవీవై పథకంలో వరంగల్‌లో ఆఫీస్ బిల్డింగ్ పూర్తిగా నిర్మించకుండానే రూ.95 లక్షలకు యూసీలు సమర్పించినట్లు తెలుస్తోంది. మినీ బస్ కొనుగోలు, సబ్-మిషన్ ఆఫ్ సీడ్స్ అండ్ ప్లాంటింగ్ మెటీరియల్ నిధుల మళ్లింపు, వాహనాల నిర్వహణ, వ్యవసాయశాఖ కార్యదర్శి కార్యాలయంలో పనిచేసే టెక్నికల్ సిబ్బందికి వేతన చెల్లింపులు, ఈపీఎఫ్-ఈఎస్ఐ కాంట్రిబ్యూషన్, కాకాని కన్సల్టెన్సీకి చేసిన చెల్లింపులు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, సీడ్ టెస్టింగ్ ల్యాబ్ పేరుతో ఆర్‌కేవీవై నిధుల మళ్లింపులో జరిగిన అవకతవకలు ఏజీ ఆడిట్‌లో వెలుగుచూశాయి. మిగిలిన సంవత్సరాల్లో చిట్టిబాబు అండ్ కంపెనీ, సుబ్రమణ్యం అండ్ కంపెనీ అనే ఏజెన్సీలతో ఆడిట్ చేయించారు. అక్రమాలను కప్పి పుచ్చుకునేందుకే ప్రైవేటు ఏజెన్సీలతో ఆడిట్ చేయించినట్లు ఆరోపణలున్నాయి.

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి

తుర్కపల్లి, మార్చి 6: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఎంపీడీవో రుద్రమాదేవి కోరారు. మండలంలోని వాసాలమర్రి గ్రామపరిధిలోని అరుణ్ తేజ ప్రకృతి వ్యవసాయ క్షేత్రంలో బుధవారం నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో మాట్లాడారు. మహిళలు తమ కాళ్ల మీద తామే నిలబడే విధంగా అన్నిరంగాల్లో ముందుండాలన్నారు. పిలుపు సంస్థ వ్యవస్థాపక డైరెక్టర్ ఎం జనార్ధన్ మాట్లాడుతూ 33సంవత్సరాలుగా మహిళలతో పనిచేస్తూ వారి అభివృద్ధిలో పాలు పంచుకుంటున్నామన్నారు. మహిళలు సంఘటితమై హక్కులు తెలుసుకోవాలన్నారు. ఈ సమావేశంలో పిలుపు సంస్థ ఈడీ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ అమరేందర్, స్వరభారతి మ్యాక్స్ మేనేజర్ లక్ష్మీ, కోఆర్డినేటర్ కృష్ణ పాల్గొన్నారు.

సంస్థాన్ నారాయణపురం: పోటీ ప్రపంచంలో మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఎంపీపీ గుత్తాఉమాదేవి ప్రేమ్చందర్‌రెడ్డి కోరారు. జిల్లా మహిళా శిశు సంక్షేమ వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ బచ్చనగొని గాలయ్య, హెల్త్ సూపర్‌వైజర్ పుష్ప, శ్రీదేవి, నిర్మల, భార్గవి తదితరులు పాల్గొన్నారు.

బ్యాంక్ లావాదేవీలపై అవగాహన కలిగి ఉండాలి

రామన్నపేట, మార్చి 6: బ్యాంక్ లావాదేవీలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా సహకార బ్యాంకు మేనేజర్ ఉప్పల రవీందర్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని వెల్లంకి గ్రామంలోని రైతు వేదికలో బ్రాంచ్ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన కల్పించారు. ఆర్థిక అక్షరాస్యతపై సూచనలు పాటించాలని, బ్యాంకు నుంచి ఇవ్వనున్న రుణ సదుపాయాలను తెలుసుకొని రుణాలు పొందాలని సూచించారు. డిపాజిట్లపై బ్యాంకులో అధిక వడ్డీ చెల్లిస్తున్నామని, 10నిమిషాల్లో గోల్డ్‌లోన్ సదుపాయం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో బ్యాంకు సూపర్‌వైజర్ సాంబయ్య, సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

'మేడిగడ్డ బ్యారేజీకి మరమ్మతులు చేపట్టాలి'

మోత్కూరు, మార్చి 6: కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన మేడిగడ్డ బ్యారేజీలో పగుళ్లు పట్టిన మూడు పిల్లర్లకు మరమ్మతులు చేపట్టాలని బీఆర్ఎస్ నాయకులు కోరారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మండల రైతులు కలెక్టరేట్‌లో బుధవారం వినతిపత్రం అందజేశారు. రైతుల సాగు నీటి కష్టాలు తీర్చడానికి మాజీ సీఎం కేసీఆర్ దూరదృష్టితో నిర్మించిన ప్రాజెక్టులో ఏర్పడిన చిన్న లోపాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ఎత్తిచూపుతూ మరమ్మతులు చేపట్టకుండా రాజకీయం చేస్తోందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పొన్నెబోయిన రమేష్, కొండ సోంమల్లు, రైతులు లోతుకుంట స్వామి, పి.నర్సయ్య, కనకయ్య, వల్లందాసు వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ 'గృహజ్యోతి' వర్తింపజేయాలి

మోత్కూరు, మార్చి 6: గృహజ్యోతి పథకాన్ని 200యూనిట్లలోపు విద్యుత్ వాడుకునే వారందరికీ వర్తింపజేయాలని సీపీఎం మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు డిమాండ్ చేశారు. మోత్కూరులో బుధవారం విలేకరులతో మాట్లాడారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వారిలో కొందరికే జీరో బిల్లులు ఇచ్చి, మరికొందరికి బిల్లులు ఇస్తున్నారన్నారు. విద్యుత్ అధికారుల వద్దకు వెళ్లి అడిగితే మండల పరిషత్ కార్యాలయానికి వెళ్లి అడగమంటున్నారన్నారు. వినియోగదారులను ఆఫీసుల చుట్టూ తిప్పుకోకుండా ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్న వారందరికి గృహజ్యోతి పథకంలో జీరో బిల్లులు ఇవ్వాలన్నారు.

సమాజ సేవలో రోటరీ క్లబ్ ముందంజ

భువనగిరి రూరల్, మార్చి 6: సమాజ సేవ కార్యక్రమాల్లో రోటరీ క్లబ్ ముందంజలో ఉందని రోటరీ క్లబ్ ఆఫ్ భువనగిరి సెంట్రల్ అధ్యక్షుడు ఫక్కీర్ కొండల్‌రెడ్డి అన్నారు. మండలంలోని వీరవెల్లి జడ్పీహైస్కూల్‌లోని ఐదుగురు విద్యార్థినులకు క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం సైకిళ్లను అందజేశారు. పాఠశాలలో విద్యను అభ్యసించేందుకు సుదూర ప్రాంతాల నుంచి వస్తున్న పేద విద్యార్థులకు రవాణా కోసం సైకిళ్లను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జోన్ చైర్మన్ డాక్టర్ యంపాల బుచ్చిరెడ్డి, ప్రతినిధులు ఎండీ. అనీఫ్, గుమ్మల మల్లేశం, పాఠశాల హెచ్ఎం కె సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు సుభిక్షంగా ఉండాలి : రమణానంద మహర్షి

భువనగిరి రూరల్, మార్చి 6: రాబోయే కాలంలో ప్రజలు సుభిక్షంగా ఉండేందుకు శివలింగాలు, దేవతామూర్తులను ప్రతిష్ఠిస్తున్నట్లు సిద్ధగురు రమణానంద మహర్షి అన్నారు. మండలంలోని నాగిరెడ్డిపల్లి శివారులో గల శివశక్తి శిరిడిసాయి అనుగ్రహ పీఠంలో బుధవారం ఆయన లోక కల్యాణార్థం 35 దేవతామూర్తు, 45 తాంత్రిక సిద్ధగురుల మొత్తం 80 విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమం భక్తుల సమక్షంలో నిర్వహించారు. భక్తులు నిష్ఠతో కొలిస్తే ఆధ్యాత్మికంగా ప్రగతి సాధిస్తారని ఉద్బోధించారు. ప్రతిష్ఠాపన చేసిన దేవతామూర్తుల శివలింగాలకు దూప, దీప, నైవేద్యాలతో హారతి ఇచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. హోమ అభిషేక పూజలు జరిగాయి.



పూజలు చేస్తున్న రమణానంద మహర్షి

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

సంస్థాన్ నారాయణపురం, మార్చి 6: మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని ప్రాచీన శివాలయంలో బుధ వారం మహాశివరాత్రి ఉత్సవాలు ప్రారంభమ య్యాయి. అఖండ దీపా రాధన, కలశ స్థాపన, గణపతి పూజ, ధ్వజారోహణ రుద్రాభిషేకం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు పాల్వాయి స్రవంతి పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ జక్కిడి జంగారెడ్డి, ఆలయ అధ్యక్షుడు పాలకుర్ల యాదయ్య, గడ్డం మురళీధర్‌రెడ్డి, పాలకుర్ల గిరి, రాసాల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

అడ్డగూడూరు, మార్చి 6: ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ డీ. నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చిర్రగూడూరు గ్రామనికి చెందిన చేగోని సందీప్ ఎలాంటి అనుమతులు లేకుండా బిక్కేరు వాగు నుంచి మంగళవారం రాత్రి అక్రమంగా ఇసుక తరలిస్తుండగా విశ్వసనీయ సమాచారం మేరకు పట్టుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బీజేపీ పట్టణ, మండల అధ్యక్షుల ఎంపిక

భువనగిరి టౌన్, మార్చి 6: పట్టణాలు, మండలాలకు బీజేపీ నూతన అధ్యక్షులను నియమిస్తూ ఆ పార్టీ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పాశం భాస్కర్, యన్నం శివకుమార్ బుధవారం ప్రకటించారు. భువనగిరి పట్టణ అధ్యక్షుడిగా రత్నపురం బలరాం, చౌటుప్పల్ పట్టణ అధ్యక్షుడిగా కంచర్ల గోవర్ధన్‌రెడ్డి, మండల అధ్యక్షుడిగా చినుకాని మల్లేష్‌యాదవ్, పోచంపల్లి పట్టణ అధ్యక్షుడిగా దబ్బెకార్ సాహేష్, పోచంపల్లి మండల అధ్యక్షుడిగా రాజుయాదవ్, సంస్థాన్ నారాయణపూర్ మండల అధ్యక్షుడిగా సుర్వి రాజుగౌడ్, అడ్డగూడూరు మండల అధ్యక్షుడిగా నానాబోతు సైదులు, వలిగొండ మండల అధ్యక్షుడిగా బొల్ల సుదర్శన్, బీబీనగర్ మండల అధ్యక్షుడిగా వింజమూరి ప్రభాకర్‌ను నియమించారు.

ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్



ఆలేరులో వినతిపత్రం అందజేస్తున్న మాజీ విప్ సునీత

ఆలేరు రూరల్, మార్చి 6: రాష్ట్రంలోని కాంగ్రెస్ పార్టీ మాట ఇచ్చి ప్రజలను మోసం చేస్తున్నదని మాజీ విప్ గొంగిడి సునీత అన్నారు. ఆలేరులోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం నిర్వహించిన ధర్నాలో మాట్లాడారు. ఎల్ఆర్ఎస్‌పై మాట తప్పి డబ్బులను వసూలు చేయడం తగదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు అందకుండా చేయాలని చూస్తున్నారన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలోని అన్ని పార్లమెంట్ స్థానాలను బీఆర్ఎస్‌పే గెలుచుకుంటుందన్నారు. ప్రజలు బీఆర్ఎస్ పాలనను తిరిగి కోరుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ పల్లా వెంకట్‌రెడ్డి, తోటకూర అనురాధ, చామకూర గోపాల్, బీఆర్ఎస్ నాయకులు హరిశంకర్‌గౌడ్, గడ్డమీది పాండరి, మునిసిపల్ చైర్మన్ శంకరయ్య, గడ్డమీది రవీందర్‌గౌడ్, పుట్ట మల్లేశం, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

భువనగిరి టౌన్: తాము అధికారంలోకి వస్తే ఉచితంగా ఎల్ఆర్ఎస్ అమలు చేస్తానని గతంలో ఇచ్చిన హామీని కాంగ్రెస్ పార్టీ నిలుపుకోవాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. ఎల్ఆర్ఎస్ అమలు తీరుపై బుధవారం భువనగిరిలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఎల్ఆర్ఎస్ చార్జీల పేరిట ప్రభుత్వం దోపిడీకి ప్రయత్నిస్తోందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వమే ప్లాట్ల యాజమానులకు న్యాయం చేసేందుకు ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను స్వీకరించిందన్నారు. అనంతరం ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ మండల అధ్యక్ష కార్యదర్శులు ఏవి కిరణ్‌కుమార్, రచ్చ శ్రీనివాస్‌రెడ్డి, జనగామ పాండు, నీలా ఓంప్రకాష్, జడ్పీటీసీ సుబ్బూరు బీరుమల్లయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ ఎనబోయిన ఆంజనేయులు, మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ అంబేద్కర్, కొలుపుల అమరేందర్, చింతల కిష్టయ్య, ఇట్టబోయిన గోపాల్, అధికం లక్ష్మీనారాయణగౌడ్, తాడం రాజశేఖర్, నాగారం సూరజ్ పాల్గొన్నారు.



భువనగిరిలో ర్యాలీ నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మోత్కూరు అభివృద్ధికి నిధులు కేటాయిస్తాం

మోత్కూరు, మార్చి 6: మోత్కూరు మునిసిపాలిటీ అభివృద్ధికి నిధులు కేటాయించడంతో పాటు అన్ని విధాలా సహకరించి మోత్కూరును అగ్రగామిగా నిలుపుతానని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. నూతనంగా చైర్ పర్సన్‌గా ఎన్నికైన గుర్రం కవితలక్ష్మీనర్సింహారెడ్డి బుధవారం భువనగిరిలో ఎమ్మెల్యే మందుల సామేల్‌తో కలిసి మంత్రిని మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. తన ఎన్నికకు సహకరించిన మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. మోత్కూరు మునిసిపల్ క్రేందం నుంచి బుజిలాపురం, కొండగడప గ్రామాల వరకు డబుల్ రోడ్డు బీటీ చేయడానికి, మునిసిపాలిటీలో మురుగుకాల్వల నిర్మాణానికి, సెంట్రల్ లైటింగ్‌కు అవసరమైన నిధులు కేటాయిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, డీసీసీ అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి, కౌన్సిలర్ కూరెళ్ల కుమారస్వామి, నాయకులు కారుపోతుల శ్రీనివాస్, పన్నాల శ్రీనివాస్‌రెడ్డి, బద్దం నాగార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● మోత్కూరు మునిసిపల్ చైర్‌పర్సన్‌గా నూతనంగా ఎన్నికైన గుర్రం కవితలక్ష్మీనర్సింహారెడ్డి (కాంగ్రెస్)మంగళవారం సాయంత్రం స్థానిక ఎమ్మెల్యే మందుల సామేల్‌తో కలిసి హైద్రాబాదులో సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. మునిసిపాలిటీ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వంగాల సత్యనారాయణ, మాజీ అధ్యక్షుడు పైళ్ల సోమిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు గుండగోని రామచంద్రు పాల్గొన్నారు.



సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన మోత్కూరు చైర్‌పర్సన్ కవిత

ఉత్సవాలతో భక్తుల్లో ఐక్యతా భావం



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

చౌటుప్పల్ టౌన్, మార్చి 6: దేవాలయాల్లో నిర్వహించే ఉత్సవాలతో భక్తుల్లో ఐక్యతా భావం పెరుగుతుందని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మునిసిపాలిటీలోని లింగోజీగూడలో గల శివ మహాదేవ దేవాలయంలో ఈ నెల 8న నిర్వహించే మహా శివరాత్రి ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను బుధవారం ఆవిష్కరించారు. మహా శివరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలన్నారు. కార్యక్రమంలో దేవస్థాన చైర్మన్ బండమీది ఎల్లయ్య, మాజీసర్పంచ్ ఊదరి నర్సింహ, కాంగ్రెస్ నాయకులు బీఎన్‌రెడ్డి, ఎ. లింగస్వామి, బి. వెంకటేశం, ఎం. సురేష్, కిష్టయ్య, యాదయ్య, నరేష్, నవీన్ పాల్గొన్నారు.

పరీక్ష సెంటర్‌లో విద్యార్థినికి అస్వస్థత

చౌటుప్పల్ టౌన్, మార్చి 6: చౌటుప్పల్‌లోని ప్రతిభ ఒకేషనల్ కళాశాల సెంటర్‌లో బుధవారం ఇంటర్మీడియట్ ఫస్ట్ ఇయర్ సప్లిమెంటరీ పరీక్ష రాస్తున్న విద్యార్థిని ఫర్హాన్ అంజుమ్ తీవ్ర అస్వస్థతకు గురైంది. కాలేజీ కరస్పాండెంట్ చిలువేరు శ్రీనివాస్ వెంటనే స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తీసుకెళ్లి చికిత్స చేయించారు. ఆరోగ్యం కుదుటపడడంతో చౌటుప్పల్‌లోని ఇంటికి పంపించారు. కాగా, పరీక్షల కోసం రాత్రింబవళ్లు చదువుతుండడం వల్ల నిద్రలేమితో తన కూతురు అస్వస్థతకు గురైందని, ప్రస్తుతం ఆరోగ్యంగానే ఉందని తండ్రి వలీ తెలిపారు. విద్యార్థిని ఆరోగ్య పరిస్థితిపై అధికారులు సైతం వాకాబు చేశారు.

ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలి

భువనగిరి టౌన్, మార్చి 6: శివరాత్రి, రంజాన్ మాసం ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అధికారులకు సూచించారు. భువనగిరిలో బుధవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు. భువనగిరి పట్టణంలోని అన్ని ఆలయాల వద్ద శివరాత్రి పర్వదిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. అలాగే రంజాన్ మాసం త్వరలో ప్రారంభం కానుండడంతో మజీద్‌లు, దర్గాల వద్ద నెల రోజుల పాటు ఇబ్బందులు తలెత్తకుండా శానిటేషన్, వీధి దీపాలు, తదితర ఏర్పాట్లు చేయాలన్నారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగకుండా ట్రాన్స్‌కో అధికారులు శ్రద్ధ చూపాలన్నారు. సమావేశంలో మునిసిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, కమిషనర్ రామాంజుల్‌రెడ్డి, ట్రాన్స్‌కో డీఈ మల్లికార్జున్ ఉన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

మెరుగైన సేవలతో ఖాతాదారుల మన్ననలు

చౌటుప్పల్ టౌన్, మార్చి 6: ఏపీ గ్రామీణ వికాస్ బ్యాంక్(జీవీబీ) మెరుగైన సేవలను అందిస్తూ ఖాతాదారుల మన్ననలు పొందుతుందని ఆ బ్యాంక్ చైర్మన్ కె. ప్రతాప్‌రెడ్డి అన్నారు. చౌటుప్పల్ పట్టణంలో ఏపీజీవీబీ అందించిన రుణంతో నెలకొల్పిన వాటర్ బాటిల్ తయారీ యూనిట్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. ఏపీజీవీబీ రుణంతో ఏర్పాటు చేసిన పారమిత చిన్న పిల్లల ఆసుపత్రిని సందర్శించి, యాజమాన్యానికి తగిన సూచనలు, సలహాలను ఇచ్చారు. అనంతరం జరిగిన ఖాతాదారుల సమావేశంలో మాట్లాడుతూ వాణిజ్య బ్యాంక్‌లకు దీటుగా ఏపీ జీవీబీ బ్యాంక్ అన్ని రకాల సేవలను అందిస్తుందన్నారు. తెలుగు రాష్ట్రాల్లో 79లక్షల మంది ఖాతాదారులకు సేవలను అందిస్తూ రూ56వేల కోట్ల వ్యాపారాన్ని సాగిస్తున్నామని వివరించారు. డిపాజిట్లపై అధిక వడ్డీ చెల్లిస్తూ, అన్ని వర్గాల ప్రజలకు అవసరమైన ప్రభుత్వ ప్రైవేట్ రుణాలను అందిస్తున్నామన్నారు. ఉమ్మడి నల్లగొండ, మహ బూబ్‌నగర్, ఖమ్మం, వరంగల్, మెదక్ జిల్లాలు, ఏపీలోని ఉమ్మడి విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో ఈ బ్యాంక్ ఖాతాదారులకు సేవలు అందిస్తుందన్నారు. కార్యక్రమంలో భువనగిరి రీజనల్ మేనేజర్ పి. సమత, చౌటుప్పల్ బ్రాంచ్ మేనేజర్ బి. రవికాంత్ పాల్గొన్నారు.



చౌటుప్పల్‌లో చెక్కు అందజేస్తున్న ఏపీజీవీబీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి

భూదాన్‌పోచంపల్లి: ఏపీజీవీబీ సేవలు అందిస్తోందని బ్యాంకు చైర్మన్ కె. ప్రతాపరెడ్డి అన్నారు. భూదాన్‌పోచంపల్లి శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని చేనేత కార్మికులకు రూ.1.50కోట్ల రుణాలను పంపిణీ చేశారు. రుణాలు తీసుకున్న లబ్ధిదారులు సకాలంలో చెల్లించి తిరిగి వారు ఎక్కువ మొత్తంలో రుణాలు పొందేందుకు వీలుంటుందన్నారు. ఈ సమావేశంలో ఏపీజీవీబీ భువనగిరి రీజనల్ మేనేజర్ పి సమత, బ్రాంచి మేనేజరు ఆకుల కిరణ్‌సింహ, సిబ్బంది బి నికిల్‌కుమార్, కె మౌనిక, జి కార్తీక్, జి హరిణిమ, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

భూదాన్‌పోచంపల్లిలో ఐఐహెచ్‌టీ ఏర్పాటు చేయాలి

భూదాన్‌పోచంపల్లి, మార్చి 6 : తెలంగాణకు మంజూరు చేసిన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్స్‌టైల్స్ - ఐఐహెచ్‌టీ ప్రముఖ చేనేత కేంద్రమైన భూదాన్‌పోచంపల్లిలో ఏర్పాటు చేయాలని భూదాన్‌పోచంపల్లికి చెందిన చేనేత నాయకులు తడక రమేష్ కోరారు. హైదరాబాద్‌లో బుధవారం జరిగిన వర్చువల్ సమావేశంలో కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌కి విన్నవించారు. హైదరాబాద్‌లోని ఎన్‌సీఐ సెంటర్‌లో చేనేత కళాకారులు, హస్తకళాకారులతో కేంద్ర జౌళీశాఖ సహాయమంత్రి వందన జర్దోషి ఆధ్వర్యంలో జరిగిన కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ వర్చువల్ సమావేశంలో పాల్గొన్నారు. కేంద్ర చేనేత, జౌళి శాఖ సహాయ మంత్రి వందన జర్దోషితో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రానికి ఐఐహెచ్‌టీ ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఐఐహెచ్‌టీ భూదాన్‌పోచంపల్లిలోని పోచంపల్లి హ్యాండ్లూమ్ పార్కులో ఏర్పాటు చేసి చేనేత వర్గానికి చేయూతనివ్వాలని కోరారు. సమర్థ్ పథకంతో చేనేత కార్మికులు లబ్ధిపొందుతున్నారన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర వీవర్స్ సర్వీస్ సెంటర్ డిప్యూటీ డైరెక్టర్ అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.



కేంద్ర చేనేత, జౌళిశాఖ సహాయమంత్రితో చేనేత సంఘం ప్రతినిధులు

కుష్ఠు వ్యాధి నియంత్రణే లక్ష్యం

భువనగిరి టౌన్, మార్చి 6: జిల్లాలో కుష్ఠు వ్యాధి నియంత్రణే లక్ష్యంగా పలు కార్యక్రమాలు చేపడుతున్నట్లు జిల్లా టీకాల అధికారి డాక్టర్ ఎన్. వంశీకృష్ణ తెలిపారు. భువనగిరిలోబుధవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో కుష్ఠు వ్యాధిగ్రస్థుల గుర్తింపునకు ఈ నెల 11 నుంచి వచ్చేనెల 24వ తేదీ వరకు 14 రోజులపాటు ఇంటింటి సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆశ కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి కుష్ఠువ్యాధిపై అవగహన కల్పించి వ్యాధి లక్షణాలు ఉన్నవారిని గుర్తించి నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలన్నారు. సమావేశంలో ఎన్‌సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సుమన్ కళ్యాణ్, అధికారులు డాక్టర్ కాటంరాజు, డాక్టర్ మైకేల్ సుకుమార్, ధరణికుమార్, జ్యోతి, సతీష్‌కుమార్, బసవరాజ్ పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలు మృతి

ఆలేరు రూరల్, మార్చి 6: మండలంలోని శారాజీపేటకు చెందిన శతాధిక వృద్ధురాలు కూరెళ్ల లక్ష్మి(100) బుధవారం అనారోగ్యంతో మృతిచెందారు. ఆమె భర్త తెలంగాణ సాయుధ పోరాటయోధుడు కూరెళ్ల వీరయ్య. వీరికి ఇద్దరు కుమారులు, ఐదుగురు కుమార్తెలు ఉన్నారు. భర్త వీరయ్యతో పాటు కుమారులు ఇద్దరు చనిపోవడంతో ఆలేరుకు వచ్చి కుమార్తెల వద్ద ఉంటుంది. కొద్దిరోజుల వరకు ఆమె పనులు ఆమెనే స్వయంగా చేసుకునేది. తమ కుటుబాలకు చెందిన మూడు తరాలను ఆమె చూసిందని, నూరేళ్ల జీవించిందని కుటుంబ సభ్యులు తెలిపారు. లక్ష్మి అంత్యక్రియలు సాయంత్రం నిర్వహించారు.



లక్ష్మి(ఫైల్)

మహిళల ఆర్థిక స్వావలంబనకు కేంద్రం చేయూత

భువనగిరి టౌన్, మార్చి 6: పలు సంక్షేమ, వ్యాపారాభివృద్ధికి బ్యాంకు రుణాలు, తదితర పథకాల పేరిట మహిళల ఆర్థిక స్వాలంబనకు ప్రధాని నరేంద్రమోదీ చేయూతనిస్తున్నారని భువనగిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి డాక్టర్ బూర నర్సయ్యగౌడ్, పార్టీ జిల్లా అధ్యక్షులు పాశం భాస్కర్ అన్నారు. మహిళా సంఘాల సభ్యులను ఉద్దేశించి కలకత్తా నుంచి ప్రధాని మోదీ వర్చువల్ విధానంలో చేసిన ప్రసంగాన్ని బుధవారం భువనగిరిలో ఏర్పాటు చేసిన ఎల్ఈడీ స్క్రీన్‌పై మహిళలు, పార్టీ నాయకులు వీక్షించారు. మహిళలకు చట్ట సభల్లో 33శాతం రిజర్వేషన్లు, ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు, ముస్లిం మహిళల భద్రత కోసం ట్రిబుల్ తలాక్ రద్దు, సుకన్య సమృద్ధి యోజన, బేటీ పడావో, బేటీ బచావో తదితర పథకాలు అమలు చేశారన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోతంశెట్టి రవీందర్, దాసరి మల్లేశం, నర్ల నర్సింగ్‌రావు, పడమటి జగన్మోహన్‌రెడ్డి, యన్నం శివకుమార్, సుర్వి లావణ్య, వైజయంతి, చందా మహేందర్‌గుప్త, శ్యాంసుందర్‌రెడ్డి రమేష్, డీఎల్ఎన్‌గౌడ్, శ్రీశైలం, భాస్కర్ ఉన్నారు.

ఆలేరు రూరల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మహిళలకు పెద్ద పీట వేస్తోందని మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ అన్నారు. బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో ఆలేరులో బుధవారం జరిగిన ఏర్పాటు చేసిన శక్తి వందనం అభినయ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జన్ ధన్ అకౌంట్, ముద్రా లోన్స్, సుకన్య సమృద్ధి యోజన, పోషన్ మహాన్, మహిళా రిజర్వేషన్ బిల్లులను తీసుకొచ్చిందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలో, కేంద్రంలో బీజేపీదే విజయమన్నారు. సమావేశంలో బీజేపీ నాయకులు పడాల శ్రీనివాస్, మాధూరి చంద్ర, కల్పన, లక్ష్మీ, అనిత, మౌనిక, అర్చన, తదితరులు ఉన్నారు.

యాదగిరిగుట్ట రూరల్: తాను భువనగిరి ఎంపీగా ఉన్నప్పుడు కేంద్రం నుంచి రూ.9వేల కోట్లు తీసుకొచ్చి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశానని మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ తెలిపారు. గుట్టలో బుధవారం విలేకరులతో మాట్లాడుతూ బీబీనగర్‌లో ఎయిమ్స్, జిల్లా కేంద్రంలో కేంద్రీయ విద్యాలయం, పాస్‌పోర్ట్ కేంద్రంతో పాటుగా యాదాద్రికి ఎంఎంటీఎస్ 524 కిలోమీటర్ల జాతీయ రహదారి విస్తరణ, దండుమల్కాపురంలో ఇండ్రస్ట్రీయల్ పార్కు తో అనేక అభివృద్ధి పనులు చేశానన్నారు.



భువనగిరిలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ నర్సయ్యగౌడ్

విద్యార్థినితో ఇన్విజిలేటర్ అసభ్య ప్రవర్తన

భువనగిరి రూరల్, మార్చి 6: పరీక్షా కేంద్రంలో విద్యార్థినితో ఇన్విజిలేటర్ అసభ్యంగా ప్రవర్తించిన సంఘటన భువనగిరి పట్టణశివారులోని ఓ కళాశాలలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్ఐ వారణాసి సంతోష్‌కుమార్, బాధితురాలు, విద్యార్థి సంఘాల నాయకులు తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం భువనగిరి పట్టణ శివారు రాయిగిరిలోని యూనిటీ కళాశాలలో బీఫార్మసీ మొదటి సెమిస్టర్ పరీక్షలు నిర్వహించారు. పరీక్షకు హాజరైన విద్యార్థినితో కళాశాలలో ఇన్విజిలేటర్‌గా విధులు నిర్వహిస్తున్న నాగరాజు అసభ్యంగా ప్రవర్తించాడు. ఈ విషయమై రూరల్ పోలీస్‌స్టేషన్‌లో విద్యార్థిని ఫిర్యాదు చేసిందని, ఆ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ వారణాసి సంతోష్ కుమార్ తెలిపారు.

సంక్షిప్త సమాచారం..

రామన్నపేట: అనారోగ్యానికి గురై ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న విద్యావేత్త, కాంగ్రెస్ నాయకుడు మారెపల్లి మల్లారెడ్డిని కొమ్మయిగూడెం గ్రామ కాంగ్రెస్ నాయకులు బుధవారం పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ కునూరు కృష్ణగౌడ్, ఎర్ర శేఖర్‌గౌడ్, పోలగొని నర్సింహ, వి.సత్యనారాయణ, విరమళ్ల విజయ్ పాల్గొన్నారు.

రామన్నపేట: మండలంలోని కొమ్మయిగూడెం ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతున్న విద్యార్థులకు గోదాసు రాఘవేంద్ర ఆయన తండ్రి బాలనర్సయ్య జ్ఞాపకార్థం పరీక్ష ప్యాడ్లు, పౌచ్, జామెంట్రీ బాక్స్ పెన్నులు పరీక్షలకు అవసరమైన వస్తువులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం కోట విజయ, వెంకన్న, గోదాసు సుగ్రీవులు, బొక్క వెంకట్‌రెడ్డి, కట్ట మలయ్య, సీనారెడ్డి, సరోజ, తదితరులు పాల్గొన్నారు.

వలిగొండ: మండలంలోని రెడ్ల రేపాక గ్రామానికి చెందిన జువ్వగాని రాములుగౌడ్ వైద్య ఖర్చుల నిమిత్తం రూ.1.50లక్షల ఎల్ఓసి చెక్కును భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో భువనగిరి మునిసిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు బత్తిని లింగయ్యగౌడ్, మాద శంకర్‌గౌడ్, సుమన్‌గౌడ్, ధనుంజయ్యగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

అడగూడూరు: అడ్డగూడూరు మండలంలోని కంచనపల్లి గ్రామానికి చెందిన చేడే మహేందర్ భువనగిరి పార్లమెంట్ యువజన కాంగ్రెస్ కో కన్వీనర్‌గా ఎన్నికయ్యారు. యూత్ కాంగ్రెస్ ఇన్‌చార్జి సురభీ దిగ్వేది, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనరెడ్డి నియమాక ప్రతం మహేందర్‌కు అందజేశారు. తన నియామకానికి సహకరించిన పార్టీ నాయకులకు మహేందర్ కృతజ్ఞతలు తెలిపారు.

చౌటుప్పల్ టౌన్: క్రీడలతో మానసిక వికాసం పెంపొందుతుందని చౌటుప్పల్ ఎస్ఐ యాదవరెడ్డి అన్నారు. చందన స్కూల్‌లో బుధవారం నిర్వహించిన స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభించారు. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు ముఖ్యమని, శారీరక దారుఢ్యానికి క్రీడలు దోహదం చేస్తాయన్నారు. కార్యక్రమంలో స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ ఎ. గోవర్ధన్, ప్రిన్సిపాల్ ఎ. రామేశ్వరీ, ఉపాధ్యాయులు స్వప్న, నర్మద, పద్మ, రేణుక, గీత, అర్చన, జగదీశ్వరీ, స్రవంతి, కవిత తదితరులు పాల్గొన్నారు.

చౌటుప్పల్ టౌన్: ఆర్టీసీ ఔట్ సోర్సింగ్ సిబ్బందికి చౌటుప్పల్ పట్టణంలోని బాలాజీ షాపింగ్ మాల్ యజమాని కృష్ణా రాం చౌదరీ దుస్తులు అందజేశారు. నార్కట్‌పల్లి, చిట్యాల, చౌటుప్పల్‌లోని ఆర్టీసీ బస్ స్టేషన్‌లలో పనిచేస్తున్న స్వీపర్‌లతో పాటు ఔట్ సోర్సింగ్ సిబ్బందికి దుస్తులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ కంట్రోలర్లు ఆనందరావు, రామచందర్ తదితరులు పాల్గొన్నారు.

బొమ్మలరామారం: మండలంలోని కేకేతండాలో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మొబైల్ మెడికేర్ యూనిట్ కార్యక్రమంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ చల్ల జయశ్రీ, వైద్య బృందం సభ్యులు సేవలు అందించారు. వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం 54 మందికి ఉచితంగా మందులు అందజేయడం జరిగింది. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ జిల్లా కమిటీ వైస్ చైర్మన్ దిడ్డి బాలాజీ, సభ్యులు, ఎస్పీ.ఉపేందర్‌రావు, ఎస్పీ.స్పందన, రేణుక, సంజీవరెడ్డి, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

బొమ్మలరామారం: మండలంలోని సోమాజిపల్లి ప్రాథమిక పాఠశాలలో పెరికల ఆదినారాయణ జ్ఞాపకార్థం ఆయన కుమారుడు పెరికల అరుణ్‌కుమార్ రూ.లక్షతో వంట గది నిర్మించారు. అరుణ్‌కుమార్‌ను ఎంపీపీ చిమ్ముల సుధీర్‌రెడ్డి అభినందించారు. కార్యక్రమంలో ఎంఈవో కృష్ణ, హెచ్ఎం నాగార్జున, మాజీ ఉపసర్పంచ్ చందర్‌నాయక్, ఉపాధ్యాయులు ప్రదీప్‌కన్న, వర్షు, పద్మ తదితరులు పాల్గొన్నారు.

మోత్కూరు: మోత్కూరుకు చెందిన రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ డాక్టర్ గుర్రం లక్ష్మీనర్సింహారెడ్డిని మండలంలోని దత్తప్పగూడెం కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో ఏపీఐడీసీ మాజీ డైరెక్టర్ కంచర్ల యాదగిరిరెడ్డి, ఎంపీటీసీ ఆకవరం లక్ష్మణాచారి, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు తెప్పాల రాయల్, కారుపోతుల శ్రీనివాస్, నారమల్ల రవి, గుండు యాదగిరి, శీలం రాజు, ఎలుగు లింగమల్లు పాల్గొన్నారు.

మోత్కూరు: మోత్కూరు మునిసిపల్ నూతన చైర్‌పర్సన్‌గా ఎన్నికైన గుర్రం కవితలక్ష్మీనర్సింహారెడ్డికి గురువారం రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో సన్మానించనున్నట్లు రెడ్‌క్రాస్ మోత్కూరు శాఖ అధ్యక్ష, కార్యదర్శులు ఓ.సత్యనాథ్, మెట్టు మంగేష్ ఒక ప్రకటనలో తెలిపారు. రెడ్‌క్రాస్ సభ్యులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

మోత్కూరు: మోత్కూరు మండలకేంద్రంలో ఈ నెల 9, 10వ తేదీల్లో నియో స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించనున్నట్లు ఆ క్లబ్ యజమాని పోచం నారాయణ తెలిపారు. పోటీలో పాల్గొన దల్చిన క్రీడా జట్టు రూ.600 ఎంట్రీ ఫీజు చెల్లించి తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

గుండాల: గ్రామ పంచాయతీ కార్మికుల 14నెలల వేతన బకాయిలు చెల్లించాలని సీపీఎం మండల కార్యదర్శి మద్దెపురం రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వం జీవో నెంబర్ 51ద్వారా తీసుకువచ్చిన మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, యాకయ్య, రాజు, అన్నెపర్తి గిరి పాల్గొన్నారు.

గుండాల: గుండాల మండల కేంద్రంలోని రైతు వేదికలో బుధవారం నిర్వహించిన రైతునేస్తం వీడియోకాన్ఫరెన్స్‌లో వ్యవసాయాధికారులు, రైతులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏడీఏ వెంకటేశ్వర్లు, వ్యవసాయాధికారి లావణ్య, ఏఈవోలు క్రాంతి, భార్గవి, రాంసింగ్ పాల్గొన్నారు.

సంస్థాన్ నారాయణపురం: రాచకొండలోని గాలిబ్ షాహిద్ దర్గా ఉర్సు ప్రారంభమైంది. మండలకేంద్రం నుంచి రాచకొండలోని దర్గా వరకు గంధాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లారు. కార్యక్రమంలో ఉప్పల లింగ స్వామి, గుత్తా ప్రేమ్చందర్ రెడ్డి, అక్బర్‌అలీ, ఉస్మాన్, చంద్రారెడ్డి ఉన్నారు.